"సుబ్బరావయ్యగారు పెళ్ళి చేసుకుంటున్నారటగా ?"
"ఏ సుబ్బరావయ్య ?"
"ఇంకెవరూ ? మీ మేష్టరుగారూ.... మీ ఫ్రెండు తండ్రీ– సుబ్బరావయ్య !"

సుజాతకేసి కాసేపు పరీక్షగా చూశా. ఆమె చాలా సీరియస్‌గానే చెప్పింది విషయం. కొంతసేపు నేనూ ఆలోచనలో పడ్డా !

"పేషెంట్లతో అలసిపోయి వచ్చారు. అనవసరంగా చెప్పానేమో మీకు.... కళ్ళు మూసుకు నిద్రపోండి" సుజాత బెడ్‌రూం లైట్ ఆర్పేసి ముసుగెట్టుకు పడుకుంది. నాకు నిద్ర రాలా!

సుబ్బరావయ్య మేష్టారు, హైస్కూల్లో చిన్న తరగతులకు లెక్కల మేష్టారు. తోమిన కంచు మరచెంబులా వుండేవారు.. ఎర్రటి దేహచ్ఛాయ. మెరిసే తలపై పలుచగా తెల్ల వెంట్రుకలు. ఓ చిన్న పిలక. పలుచటి ఖద్దరు బట్టలు !

క్రమబద్ధమైన జీవితాన్ని, నియమాలనూ అలవాటు చేసుకోవడంవల్ల, మేష్టారి జీవితంలో, నిత్యకృత్యంలో అన్నీ యాంత్రంలా జరిగిపొయ్యేవి. పైగా, గరళకంఠుడిలా, అన్నీ మనసులో దాచుకుని, పిడి రాయిలా నడిచేవారు.

తెల్లవారు ఝామునే కృష్ణకు వెళ్ళి తలారా స్నానంచేసి, ప్రొద్దుపొడిచే వేళకు విభూతి నామాలతో, వీధి అరుగుమీద కూర్చుని పిల్లలకు పాఠాలు చెప్పేవారు. మధ్యమధ్య కుంపటిమీద ఉడికే అన్నం,పప్పు చూస్తుండేవారు. భార్య రాధమ్మకు కీళ్ళవాతం. అందువల్ల ఆమె పీటమీదనుంచి లేచేదిగాదు. అన్నీ అందిస్తే కూరలు తిరగమాత వేసేది. ఉప్పు, కారం అంచనా చెప్పేది అంతే.

సుబ్బరావయ్యగారు, అటు ఇంట్లో ఆడపనీ, బయట మగపనీ చేసుకు ముగ్గురు కొడుకుల్నీ బడికి పంపి, తానూ అంగలు పంగలమీద స్కూలుకు చేరేవారు. ఆ రోజుల్లో ఆయనకు 'లేటు మేష్టరు' అనే బిరుదుండేది. ఎందుకంటే, పొరపాటున కూడా ఆయన బడికి సమయానికి వచ్చేవారు కాదు. అయినా ఆయన లెక్కలు బాగా చెబుతాడనీ, ఎంత రాలుగాయి వెధవైనా,ఆయన దగ్గర తోక ముడుచుకు వుంటాడనీ ప్రతీతి వల్ల అటు మేనేజిమెంటూ, ఇటు పిల్లలూ ఆయన్ను గౌరవించేవారు.

# తొలిప్రేరి

ముగ్గురు కొడుకులూ చదువుకుని ప్రయోజకులై, వేరే ఊళ్ళల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డా, సుబ్బరావయ్యగారు ఊరు వదల్లా. మాష్టారి ఆఖరి కొడుకు శ్యామూ నేను స్నేహితులమేగాక, కలిసి చదువుకున్నాం. ఆ స్నేహంవల్ల సెలవలకు వచ్చినప్పుడల్లా-

"మా నాన్న చాలా వింత మనిషిరా! ఇన్నేళ్ళొచ్చినా మేం సంపాదనలోకొచ్చాకా ఆయనకెందుకా ట్యూషన్లు! పోనీ మాఅమ్మ అయినా చేసి పెడుతుందిలే, ముసలాళ్ళిద్దరూ ఓ చోట వుంటారులే అనుకుంటె ఆవిడకి ఆయనచెయ్యాల్సిందేగదా!ఎందుకీ అవస్థలు రావయ్యా అంటే ఉహూ! సుతరామూ వినడు" అని నా దగ్గర చెప్పుకు బాధపడేవాడు.

ఇవే మాటలు సుబ్బరావయ్యతో అంటే, నవ్వి, "కాలూ చెయ్యి బాగుండగా వాళ్ళ దగ్గిర కెళ్ళి, వాళ్ళకు బరువు కావడందేనికి? పైగా తిని కూర్చోవడం నా తత్వానికి గిట్టని వ్యవహారం" అనేవారు.


సుబ్బరావయ్య మేష్టారు, భార్యను తీసుకు నా దగ్గరి కొచ్చినప్పుడు తప్ప, నా నర్సింగ్ హోం, రోగులతో తీరక, నేనసలు వాళ్ళింటి వేపు వెళ్ళడం కుదిరేది కాదు. ఆయనొచ్చినప్పుడే సంగతులు తెలిసేవి.

పోతే మేష్టారు, ఉచితంగా వైద్యం చేయించుకునేవారుకాదు, నే ఫీజు తీసుకోను అంటే, "నీయిష్టం ! నే మటుకు నీదగ్గరకు రాను " అని ఖరాఖండీగా చెప్పేశారు.

అలాంటి సుబ్బరావయ్య పెళ్ళిచేసుకుంటారు అనగానే, నా కెందుకో నమ్మబుద్ధి కాలేదు!

ఆ తర్వాత రెండు రోజులకు సరస్వతి వచ్చింది. ఆవిడ ఈ మధ్యని మా నర్సింగ్ హోంలో పురుడు పోసుకుంది. అదీగాక, మాకు చాలా దూరపు చుట్టరికం గొడవుంది. వస్తూనే "మీతో మాట్లాడాలి" అంది.

నా రౌండ్స్ పూర్తయ్యేసరికి మూడయింది. అప్పటిదాకా కూర్చుంది. ఆకలవుతున్నా, ఇంటికి వెళ్ళా లనిపించినా, సరస్వతికోసం కూర్చున్నా.



సరస్వతి వచ్చిదాలింత. పైగా మనసులో మథనపడుతున్నదేమో, మొహమంతా వాడిపోయి వుంది.

"మీ అబ్బాయి కులాసానా?"

"ఆ!!.... మీకు సుబ్బరావయ్య మేష్టారు తెలుసా?"

"ఊ!"

"ఊ కాదు! ఆయన్ను కోప్పడేంత చనువుందా?"

"అస్సలు సంగతి చెప్పకుండా హామీలు కావాలా!"

"నవ్వులాట కాదు. చాలా సీరియస్‌గానే చెబుతున్నా. ఆయన్ను శాసించగల అధికారం వుందా లేదా? చెప్పండి. వెడతాను!"

"విషయంచెప్పు!నా చేతనైందిచేస్తాను!"

సరస్వతి కళ్ళు తుడుచుకుంది. "డాక్టరుగారూ నా సంసారం అంతంత మాత్రం. మీకు తెలుసుగా. ఆయనకు నన్ను కాకిలా పొడవడం హాబీ. అంతా ఆడపిల్లలే అని మరీ చులకన. మొన్ను ఆ వెధవ పుట్టకపోతే నేను ఆ యింటికి వంట మనిషినే అవుదును. మొగ సన్నాసి పుట్టాడు. కనీసం ఇకనన్నా సుఖపడతాననుకున్నా. కానీ నాకా యోగం లేదు" సరస్వతి గొంతు బొంగురుపోయింది.

"సుబ్బరావయ్యగారేం చేశారు ?"

క్షణం మాట్లాడలేదు సరస్వతి. నా వేపు చూడలేక కిటికీ దగ్గరకు వెళ్ళి, కాంపౌండులోకి చూస్తూ, "మొన్న మావారు చెప్పారు. 'ఆయన అదే సుబ్బరావయ్య మేష్టారు మళ్ళీ పెళ్ళిచేసుకోబోతున్నారుట. వధువు ఎవరో కాదోయ్. మా అత్తగారు!' అని వెకిలిగా నవ్వి. 'నీవూ ముండమోస్తే, నాకేం భయం లేదు. హాయిగా మళ్ళీ పెళ్ళి చేసుకుంటావ్ మీ అమ్మలాగా! మీయింట ఆచారంగదా!" అని అంటూ నన్ను కాల్చుకుతింటున్నారు. ఆయన-" అంది.

"డాక్టరుగారూ! మా అమ్మ చేసేది తప్పో ఒప్పో నాకు తెలియదు. ఎందుకంటే, నే నారు నెలల పిల్లగా వుండగా మా నాన్న పొయ్యాడట. అప్పట్నుంచీ నన్ను పెంచింది. మరి ఆవిడ జీవితంలో ఏ సుఖం అనుభవించిందో, ఎన్ని కష్టాలు పడ్డదో నాకు తెలియదు. ఇంతవరకూ ఆవిడ మొహాన నవ్వు చూడలేదు. సుఖపడ్డది అనీ అనలేను. మరి ఇన్నాళ్ళకు ఆవిడ ఎందుకిలా నిర్ణయం తీసుకుందో కూడా నాకు తెలియదు. మీరే

ఎన్. తారకరామారావు



పరిష్కారమార్గం చూడాలి!" సరస్వతి చేతులెత్తి నమస్కరించి వెళ్ళిపోయింది.

ఇందులో నే చేయగలిగిందేమిటి! నిజానిజాలెంత? తెలుసుకోవడం ఎలా? ఆలోచిస్తున్నా. రోజులు గడుస్తున్నాయి.

ఓ రోజు సుబ్బరావయ్యగారే ప్రత్యక్షమయ్యారు. వస్తూనే, "రాంబాబూ! నువ్వు నాతో రావాలి! ఎంత ఆలశ్యమైనా వుంటాను!" అన్నారు రాక తప్పదని సూచిస్తూ.

నా పనై, ఇద్దరం కారులో బయలుదేరి, కృష్ణ ఒడ్డుకు వెళ్ళాం.

కార్తీకమాసం. వెన్నెల మంచులా కురుస్తోంది. ఏటిఒడ్డున చతికిలబడ్డాం.

"విషయం నీదాకా వచ్చిందా?"

"దేని సంగతి?"

"అదే.... పెళ్ళి సంగతి!"

"ఊ!"

సుబ్బరావయ్య గువ్వలాగైనాడు. ఉత్తరీయం నడుముకూ మోకాళ్ళకూ బిగించి, మెల్లగా ఊగుతూ, "నీ అభిప్రాయం ఏమిటి?" అనడిగారు.

"ఈ వయస్సులో మీకు పెళ్ళి అవసరమా?"

ఆయన క్షణం మాట్లాడలేదు. ఆ తర్వాత "ఇంకా ప్రశ్నలు వెయ్య- నా సమాధానం చెబుతాను", అన్నారు.

"మీకు, కొడుకులు, కోడళ్ళూ, మనవలూ వున్నారు. ఉద్యోగంలోంచి రిటైరైనారు. బాదరబందీలు లేవు. మరి మీకెందుకూ పెళ్ళి!"

"బాగా అడిగావు డాక్టరూ! ఓ విషయం చెప్పనా! పిల్లలు పెద్దాళ్ళయ్యారు. బాదర బందీలు లేవు, కనుకనే పెళ్ళిచేసుకోవాలను కుంటున్నా!"

"శారీరక సుఖాలకోసమా?"

"నువ్వు డాక్టరువికదా! నా వయస్సులో వున్న మనిషికి శారీరక సుఖం పొందే అవకాశం వుందా. ఉన్నా ఎంత కాలం వుంటుంది!....అదీగాక నేనో ప్రశ్న వేస్తున్నా—పెళ్ళనేది శారీరక సుఖాలు అనుభవించడానికేనా?"

"సమాధానం మీరే చెప్పండి!"

"కాదురా డాక్టరుబాబూ! నాకు ఏ కోరికా లేదు. అయితే అనాథలా బ్రతకటం నా కిష్టంలేదు! అయ్యో, ఈయనభార్యపోయింది. కొడుకులు, కోడళ్ళు బహు యోగ్యులు, తండ్రిని కంటికి రెప్పలా చూసుకుంటారు:- ఇలాంటి సానుభూతి నా కక్కర్లేదు. వేరొకళ్ళ దయమీద బ్రతకటం నాకు చిరాకు. నేను కుంటివాడ్ని కుష్టువాడినీ కాదుగదా! పోతే పెళ్ళెందుకూ అంటే. తోడుకోసం! నా బాధ, సంతోషం, ఉద్వేగం, అనుభూతినీ పంచుకునేందుకు మనిషి కావాలి. నా వ్యక్తిత్వం కాపాడుకునేందుకు, నా మనసులోని మాట చెప్పుకునేందుకు మనిషి కావాలి. నాదనుకునే ప్రాణి కావాలి. అయితే యిందులో కామం లేదా, వాంఛలుండవా అంటే వుండొచ్చు. కానీ కామమే నా ధ్యేయం కాదు. అయితే ఎంతకాలం అంటే చెప్పలేను. క్రొత్త ప్రయత్నం అనుభూతి."

"ఈ వయస్సులో యింత తెగింపు కూడదేమో!"

"నే వొప్పుకోను. వయస్సుకూ, అనుభూతికీ సంబంధం లేదేమో! కోరిక ఎప్పుడూ తాజాగానే వుంటుందిగదా! కోరిక కలిగాక తీరకపోతే బాధేగదా! ఏమంటావు?"

"నేనేమనేది! మీ రో నిర్ణయానికొచ్చి, దాన్ని ఏదో విధంగా సమర్థించుకుంటున్నారేమో?" అని అన్నాను.

"కాదు. కనీసం నువ్వయినా నన్ను అపార్థం చేసుకోకూడదని నా తాపత్రయం."

"ఇంతకూ ఆమె ఎవరూ — అస్సలు మీకీ ఆలోచన ఎలా వచ్చింది!"

"చెప్పనా?"

"చెప్పండి...."

సుబ్బారావయ్య—కథనం—

రాధను అంటే మా ఆవిడను, రాంబాబు నర్సింగ్ హోమ్‌లో చేర్చా. కీళ్ళవాతం మరీ ఎక్కువైంది. అదీగాక అపస్మారక స్థితే ఏర్పడ్డది. మొదటినుంచీ దానికి నేనూ, నాకది. అది మంచంలో బొమ్మలా వుంటే చాలు. రాటపాకులా తిరుగుతుండేవాడిని. దానికి నీళ్ళు పొయ్యడం, జడవెయ్యడం చీరకట్టడం, అన్నీ నేనే అయ్యా. అలా దానికి సేవచెయ్యడం అంటే సరదాగా కూడా వుండేది. రాధ కూడా "నాకేమండీ! మీలాంటి మొగుడు దొరికాడు. ఈ రోజుల్లో ఇలా నాకు సేవ చేస్తున్నారంటే. నేనెంత అదృష్టవంతురాలో్న. నన్ను చూసి, మా వాళ్ళంతా ఈర్ష్యపడతారండీ. 'రాధకేమే పువ్వుల్లో పెట్టుకు చూసుకునే మొగుడున్నాడు' అని ముగ్గురుపిల్లలు ముత్యంలాంటి భర్త. నాకేమండీ. మీ చేతుల్లో సుమంగళిగా వెడితే అంతే చాలు" అనేది!

అది ఆస్పత్రిలో చేరాక, నిజంగా సుమంగళిగానే పోతుందేమో అన్న అనుమానమూ వచ్చింది! కొడుకులకు ఉత్తరం వ్రాస్తానే అంటె. "నాకు చేస్తున్నారు చాలు! ఇప్పుడు వాళ్ళంతా వస్తే, మీరే చెయ్యాలి. కోడళ్ళు వచ్చినా రెండు రోజులేగా. ఆ తర్వాత నాకు మీరు-మీకు నేను. వద్దులెండి" అంది.

అయినా ప్రాణం వుండబట్టలేక ముగ్గురికి ఉత్తరాలు వ్రాసిపడేశా. ఒకడు ఢిల్లీ. మరొకడు అస్సాం. ఇంకొకడు విశాఖపట్నం. వస్తే తల్లిని చూస్తారు అనుకున్నా.

అది ఆస్పత్రిలో చేరాక నా పైరవేట్లు మానేశా. యింత తిని, వెళ్ళి, దాని మంచం ప్రక్కనే కూర్చునేవాడిని. రాధ స్పృహ లేనప్పుడు కళ్ళు తెరచి నన్నే చూస్తుండేది ప్రేమగా, చిరునవ్వుతో. ఆ చూపులో ఎన్నెన్ని భావాలో?

రాధ పదహారేళ్ళ వయస్సులో, నా భార్య అయింది. రాధ పెళ్ళినాటికి, వాళ్ళ పెద్దన్నకు యాభై యేళ్ళు. ఆఖరిపిల్ల పెళ్ళి, ఏదో తూ తూ మంత్రంగా అయిందనిపించారు.

నాకు చదువుతప్ప, ఆస్తి. అయినవాళ్ళు లేరు. జీవితంలో, సంసారంలో, మే మిద్దరమే కష్టానికి. సుఖానికీ కూడా.

కొన్నాళ్ళు పైరవేట్లు చెప్పుకుని బ్రతికా. ఆ తర్వాత స్కూల్లో ఉద్యోగం. అప్పటికే ముగ్గురు పిల్లలు. రాధకు కీళ్ళవాతం.

డబ్బు లేకనో, సలహా చెప్పే వాళ్ళు లేకనో. రాధ నిర్లక్ష్యమో తెలియదు. దానికి జబ్బు ముదిరింది. నాకు జీవితంలో తెరపి లేని ఆయాసం మిగిలింది. ఇంట్లో ప్రతి వస్తువూ, జీవితంలో ప్రతి అనుభవం నేనూ, నా రాధ కల్సి పంచుకున్నాం. కొనుక్కున్నాం

నే లేకపోతే ఈయన ఏమవుతాడు?

ఇంత గొప్పమనిషి, ఎలా దొరికాడు నాకు?

శవాకారం లాంటి నా అవతారంలో ఈయనకు ఏం తృప్తి కలిగింది. ఈయన ప్రేమ నిజమా?

కొడుకులు, ఈయన్ను వృద్ధాప్యంలో సరిగ్గా చూస్తారా—

ఇలా, రాధ కళ్ళలో ఎన్నో ఊహలు, ఆలోచనలు. వాటిని చదవడం నాకే తెలుసు. రాధ ఎండిపోయిన చేత్తో నా బుగ్గలు తడిమేది. అంతేకాదు- ఓ అర్ధరాత్రి నన్ను లేపి, దగ్గరగా రమ్మని, బుగ్గన ముద్దెట్టుకుంది.

రాంబాబూ! నువ్వు నమ్మినా నమ్మకపోయినా మేం భార్యాభర్తలం కాదయ్యా. అమర ప్రేమికులం చూపుల్తో మాట్లాడుకునేవాళ్ళం.

ఇంకా రెండు రోజులకు పోతుందనగా, రాధ, నా చేతిని పొదివి పట్టుకుని, "మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి!" అని నా చేత వట్టేయించుకుంది.

ఆయిందా, మాఆవిడ మంచం ప్రక్కనే ఓ పురిటి కేసుంది. ఆ పిల్ల తల్లి పేరు అనూరాధ పసుపుకొమ్ములా వుండేది. ఆవిడ, నే లేనప్పుడు మా ఆవిడకు సాయం చేసేది.



కబుర్లు చెప్పేది. ఇలా పరిచయం అయింది.

ఇహ పెళ్ళి ప్రతిపాదన అంటావా?

"మేష్టారూ, వంటేం చేసుకున్నారూ?" అని అనూరాధ పలకరించేది.

చెప్పేవాణ్ణి.

"మీరు వంట బాగా చేస్తారుట. అక్కగారు మీరు లేనప్పుడు, మీ సంగతులు చెప్పి, మహా సంతోషపడుతుంటారు!" అనేది.

"ఈ రోజుల్లో మీలాంటివారు అరుదు మేష్టారూ! ఆవిడలా అంపశయ్య మీద ముప్ఫయ్యేళ్ళుగా వున్నా, మీరు సేవచేస్తున్నారంటే, కథగా చెప్పినా, చూపించినా నమ్మరు!" అనేది.

అనూరాధ మాటల్లో ఆరాధన వుండేది.

ఒకోసారి, కాఫీ యిచ్చేది.

ఒకోసారి మా దంపతుల అనురాగాన్ని చూసి ఈర్ష్య కూడా పడేది.

ఫలానా అప్పుడు అని చెప్పలేను గాని, అనూరాధ, నేనూ ప్రేమించుకున్నాం. మా చూపులు కలిశాయి. భావాలు పెనవేసుకున్నాయి.

అదీగాక,

ఓ రోజు, మా రాధ, అనూరాధను దగ్గరకు పిల్చి, తన మొహాన్నున్న కుంకుమ తీసి, ఆమె మొహానికి పెట్టి, మెళ్ళో గొలుసు కూడ వేసి, "చూడమ్మా నే పోతే ఆయన దిక్కులేనివాడవుతాడేమోనన్న బెంగతో, బొందిలో ప్రాణం పోకుండా వుంది. మీరు ఆయన్ను చేసుకోకూడదూ" అనడిగిందట.

అనూరాధ చెప్పిందా విషయం.

మీ ఆస్పత్రిలో మా పరిచయాలు అయినాయి. మంచో, చెడో అనూరాధ, నేనూ పెళ్ళిచేసుకోవాలనుకున్నాం.

సుబ్బారావయ్య కథ పూర్తయింది.

"మీ కొడుకులకు ఈ సంగతి తెలుసా?"

"తెలియదు!"

"వాళ్ళేమంటారో?"

సుబ్బారావయ్య క్షణం నా కళ్ళల్లోకి చూసి, "రాంబాబూ! తండ్రిగా నే చేయగలిగింది చేశా! వాళ్ళు నా నుంచి ఆశించేదేం లేదు. కనుక వాళ్ళు ఏమనుకున్నా నేనెందుకు భయపడాలి. పోతే, నేనేం తప్పు చెయ్యడం లేదే?"

"మరి అనూరాధ తరపున సమస్యలేం లేవా?"

"వున్నాయేమో! నే అడగలేదు, ఆమె చెప్పనూలేదు."

"అటునుంచి అభ్యంతరం వస్తే?"

"అనూరాధకు కొంత ఆస్తి వుంది. అదంతా వున్న ఒక్క కూతురికీ ఏనాడో వ్రాసేసింది. అందువల్ల ఆమెను ఆస్తి కోసమో, అందం చూసో నేచేసుకుంటున్నా


ఇంటర్ విద్యార్థులారా! టెస్టుపేపర్లు కొనకండి

ఉచితంగానే TEST PAPERS

For Only Guide Cost Now Available

namaste books Presents

Sai Made Easy Series

GUIDE AND TEST PAPERS (English Medium)

INTERMEDIATE 1983-84

| | | |
|---|---|---|
| PHYSICS | R.Chalapathi Rao's | 1St. YEAR 14.00, 2nd YEAR 14.00 |
| CHEMISTRY | J. GOPALA KRISHNA MURTHY, Dr.K.CHANDRA MOHANA RAO'S | 1St. YEAR 10.00, 2nd 12.00 |
| BOTANY | Dr.T.S.Rama Rao's | 1St. YEAR 14.00, 2nd YEAR 12.00 |
| ZOOLOGY | T.V.SIVA SASTRY'S | 1St. YEAR 14.00, 2nd. YEAR 14.00 |
| CIVICS | M.V.L.Narasimha Rao's | 1St. YEAR 9.00, 2nd. YEAR 11.00 |
| ECONOMICS | Dr.T.DIVAKARA RAO'S | 1St. YEAR 10.00, 2nd. YEAR 15.00 |

NO V.P.P. SYSTEM SEND THE COST OF THE BOOKS LESS ONE RUPEE. THE BOOKS WILL BE SENT BY V.P.P. FOR BALANCE OF ONE RUPEE ONLY FREE POSTAGE

నమస్తే బుక్స్

విజయవాడ. 520002 • ఫోన్: 14645



జాన్సన్ మిక్చర్



* అత్యంత శక్తివంతమైన మోటారు
* తక్షణ సర్వీసు సదుపాయం
* 3 జార్లతో పేర్ప్రతి సర్వీసు

సోనో విజన్,

ఏలూరు రోడ్, విజయవాడ-2.

SUVARNA



వికారములేని విరేచనక్యాప్సుల్

వేకో

ఎర్రగా గుండ్రగా ఉండును

అన్ని మెడికల్ షాపులలో దొరకును

ఇండియన్ డ్రగ్ కంపెని, విజయవాడ 2



ప్రియమైన పాఠకులకు విలువైన కానుకలు

1. జపమాల ఆంధ్రప్రభ సీరియల్ డా॥ పరుచూరి రాజారామ్ రూ 18

2. వినిపించని రాగాలు జాగృతి సీరియల్. తేజోవతి రూ 20

3. ఈ చరిత్ర ఎవరు రాస్తారో? ఆంధ్రప్రభ సీరియల్. M.D. సౌజన్య రూ 15

4. ఓ నటి కథ ప్రగతి సీరియల్ M.D. సౌజన్య రూ 16-50

పైవాటిలో మీకు కావాల్సిన పుస్తకం ధరలో 1 రూపాయి తగ్గించి పంపితే ఆ రూపాయికి VPP లో పంపిస్తాం.

గౌతమి పబ్లికేషన్స్

అరండల్ పేట, గుంటూరు, 522002



మయోస

మయోస అనే రూ.2. ధరగల పాకెట్‌లోని పరిమళద్రవ్యాన్ని గ్లాసునీటిలో కలిపితే తయారయే రూ.30. విలువచేసే అమృతమషాంపూను మీరే స్వయంగా చేసుకోవచ్చు. దీనితో సుఖంగా అనేకసార్లు తలంటుకోవచ్చు కాబట్టి కుంకుడుకాయలకన్నా చాలా చౌక. అన్నిషాపులలోను దొరుకును. మీషాపువారికిది చూపి కొంటే మీకు వారు సప్లయి చేయగలరు. పట్టణావారి పంపిణీదార్లు కావాలి. క్రింది ఎడ్రస్సుకు వ్రాయండి.

దేశసేవ, హైదరాబాదు, 500890.



డా॥ పి. ఏ. కె. రావ్, B. A.

వైద్య విద్వాన్-వైద్యాచార్య



వివాహం వాయిదా వేయ అవసరం లేదు. దాంపత్య సౌఖ్యం లోపించుట, నరముల బలహీనతలకు ఆయుర్వేద చికిత్స కలదు.

రావూస్ క్లినిక్

టి. బి. రోడ్, తెనాలి

ఫోన్స్ : 3700 & 4010

SUVARNA

## సాహితీ క్విజ్

1. "ఇంకో కవి ఎంత గొప్పవాడైనా—నువ్వు వాడివి కావాలని ప్రయత్నించకు"—అన్న ప్రముఖ కవి ఎవరు?
2. "అన్ని గర్వాలలోకి గొప్ప హానికరమైన గర్వం—నేను ధర్మపరుణ్ణి అనే గర్వం"—అన్న ప్రముఖ రచయిత ఎవరు?
3. లోక వృత్తాన్ని తన వ్యంగ్య విమర్శల్లో సామాన్యుని గొంతులో పలికించే ప్రముఖ రచయిత ఎవరు?
4. ప్రముఖ బెంగాలీ రచయిత అయినా, తెలుగు రచయితలకంటే తెలుగు సాహిత్యంలో పాతుకొన్న ప్రముఖ రచయిత పేరేమిటి?
5. "మత్కుణం" — అంటే తెలుగులో ఏమని అర్థం?
6. "షేక్స్పియర్" మీద ప్రామాణిక గ్రంథం తెలుగులో వ్రాసిన ప్రముఖ రచయిత.
7. తెలుగులో "జీవిత చరిత్రలు" వ్రాసిన ప్రముఖుడు (ఉదాహరణ : శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు — సి. ఆర్. రెడ్డి — మొదలగు వారివి.)
8. "ఇల్లాలి ముచ్చట్లు"కు సాహిత్య గౌరవం కల్పించిన ప్రముఖ రచయిత.
9. ఈ నవలా రచయిత్రి ప్రవేశంతో తెలుగు నవలా సాహిత్యంలో రచయిత్రుల ప్రాబల్యం పెరిగింది.

నిర్వహణ :

(సమాధానాలు వచ్చేవారం చూడండి) —ఎమ్. డి. సౌజన్య

నని అనుకోవడంలో అర్థంలేదు."

సుబ్బరావయ్యగారు దృఢంగా మళ్ళీ పెళ్ళికి సిద్ధపడ్డారని నిర్ణయించుకున్నా.

కారులో ఇంటికి వస్తూ అడిగా, "నే చేయగలిగిందేమైనా వుందా మేష్టారూ!"

"వుందోయ్. రిజిష్ట్రారాఫీసుకు నువ్వు, మీ ఆవిడా రావాలి, మా పెళ్ళికి సాక్షులుగా !"

"అలాగే!"

మేష్టారును సెంటరులో దింపేసి నే వచ్చా!

రిజిష్ట్రారాఫీసుకు సాక్షిగా వచ్చేందుకు మా ఆవిడ ఓ పట్టాన వప్పుకోలా !

"వాళ్ళకు సిగ్గు లేకపోతే. మీకెలా లేదూ? తగుదునమ్మా అని మనం వెడితే, అటు మీ ఫ్రెండూ, ఇటు సరస్వతీ వాళ్ళు, మనల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడతారు. ఎందుకొచ్చిన ఎండదం. పోనీయండి. నే రాను!" అని చెప్పింది.

కానీ నాకు చాలా సరదాగా వుంది. ఈ పెళ్ళి చూడాలని. మేష్టారు మీద ఆరాధన కూడా పెరిగింది నాలో! చాలా మంది అనుకున్నవి సంఘానికి, కుటుంబానికి, వర్తమానానికి జడిసి చెయ్యలేరు- చేసినా తప్పు చేసినవాళ్ళల్లా ముడుచుకుపోతారు లేదా పిరికివాళ్ళవుతారు.

కానీ సుబ్బరావయ్యగారు చేసే పని ధైర్యంగా చేస్తున్నారు. వరుడికీ, వధువుకీ పిల్లలేగాదు మనుమలూ, మనుమరాండ్రు వున్నారు. ఈ వయస్సులో మళ్ళీ పెళ్ళి ! మనం చెయ్యలేనివి. చెయ్యాలనుకున్నవీ ఇంకొకరు చేసేస్తుంటే వుండే థ్రిల్ నాకు కలిగింది. అందుకే మా శ్రీమతిని బలవంతాన తీసుకువెళ్ళాను.

బజార్లో మేష్టారికి సిల్కు ధోవతులు,వారి శ్రీమతికి ధర్మవరం జరీచీర కొనుక్కొని వెళ్ళాం.

రిజిష్ట్రారాఫీసులో తంతు పూర్తయ్యాక. ఆ దంపతులు, మేమూ, ఫొటో దిగాం.

"మీ ఇద్దరూ మా యింటికి భోజనానికి రావాలోయ్" అన్నారు మేష్టారు.

"వంట చేశారా?"

"ఆహా!నేనూ, ఆ క్రొత్త పెళ్ళికూతురు కల్సే చేశాం. సరాసరి వెళ్ళి భోజనం చెయ్యడమే!"

నా కారులో నలుగురం మేష్టారింటికి వెళ్ళాం.

ఇల్లంతా ముగ్గులు పెట్టి వుంది. వాకిలికి కిటికీలకు క్రొత్త తెరలు. ఇంట్లో సామానంతా చక్కగా పొందిగ్గా సర్దిపెట్టి వున్నాయి.

క్షణంలో భార్యాభర్తలిద్దరూ వడ్డన చేసేశారు.

అరిటి ఆకుల్లో భోజనం.వాళ్ళిద్దరూ మేమిద్దరం-అంతే.

వచ్చేటప్పుడు, మా ఆవిడ అంది "మీరు గమనించారో లేదా, వాళ్ళిద్దరూ ఇప్పుడు పెళ్ళిచేసుకున్న వాళ్ళలా లేరండి. ఎన్నో ఏళ్ళుగా కల్సివున్న వాళ్ళల్లా వున్నారు. భలే తమాషా అనిపించింది నాకు మటుకు."

నిజం. ఆవిడ అభిప్రాయంతో నేనూ ఏకీభవించా ! పెళ్ళిఫొటో కొడుకులకు పంపా.

కానీ తుఫాను వస్తుందని తెలుసు నాకు. ఏ రూపంలో వస్తుందా అని మాత్రం అంచనా వెయ్యలేకపోయినా!

శ్యాం ఓ పెద్ద ఉత్తరం వ్రాశాడు. అందులో నే చేసిన ద్రోహం గురించి వివరంగా వ్రాశాడు. అంతేకాదు బ్రతికినంత కాలం నా మొహం చూడననీ, మాట్లాడననీ వ్రాశాడు. మిగతా ఇద్దరూ ఏమనుకున్నారో ఏమో ఉత్తరం కూడా వ్రాయలేదు.

ఓ రోజు సరస్వతి ఆస్పత్రికి వచ్చింది పిల్లవాడిని తీసుకు. ఆమె ఏం మాట్లాడలేదు తల్లి గురించి. నేనే వుండబట్టలేకఅడిగా!

సరస్వతి క్షణం ఏం చెబుదామా అని ఆలోచించి, "డాక్టరుగారూ! తోటి స్త్రీగా ఆమె చేసిందానికి ఆనందిస్తున్నా. ఆమె కూతురుగా ఆమె చేసిన పనిని ఖండిస్తున్నా. నా తల్లి లేదనుకుని బ్రతుకుతున్నా. పోతే మరో విషయం: మావారికి ఈవూరినుంచి ట్రాన్స్‌ఫర్ అయింది" అని చెప్పి వెళ్ళిపోయింది.

సుబ్బరావయ్య మేష్టారి క్రొత్తకాపురం ఎలా వుందో చూద్దామనుకున్నా, తీరక వెళ్ళలేదు; నా ఆస్పత్రి. రోగులు. మందులు వీటితోనే సరిపోవడంవల్ల.

కానీ ఓ రోజు, సుబ్బరావయ్యగారే సతీసమేతంగా వచ్చారు.

నాకు తీరికయ్యేదాకా ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, నా గదిలోనే కూర్చున్నారు.

అప్పుడు పరీక్షగా చూశా !

అనూరాధ పసుపుకుంకుమతో పెద్ద ముత్తయిదువులా వుంది.

సుబ్బరావయ్యగారు పరమ శివుడిలా వున్నాడు ప్రక్కనే.

"ఏమిటి సంగతులు?" అడిగా.

"నాకు ఉద్యోగం వచ్చింది డాక్టరూ! మద్రాసులో తెలుగువారు నడిపే స్కూల్లో ఉద్యోగం ఇస్తాం రమ్మన్నారు. వెడుతున్నా. ఆ సంగతి చెబుదామనే వచ్చా!"

"మీ ఇద్దరికీ ఖర్చేముంటుందండీ. మీ పించను డబ్బు చాలదా? దానికి మీరు మళ్ళీ దూర దేశం వెళ్ళి అక్కడ ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం ఏమిటీ?"

సుబ్బరావయ్యగారు చిన్నగా నవ్వారు. ఆయన భార్య అనూరాధ సిగ్గుతో మొగ్గలా అయింది.

"మా ఆవిడకు నెల తప్పిందోయ్ డాక్టరూ."

నే నాశ్చర్యంలోంచి తేరుకునేలోగా, వాళ్ళిద్దరూ చేయి చేయి పట్టుకుని వెళ్ళిపోయ్యారు.